

'లొల్ల'కు సీఎం అవార్డు

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డును అందుకుంటున్న లొల్ల సర్పంచ్ జగన్నాథం... - 4లో



గ్రామాల్లో పోటీతత్వం పెంచేందుకు ప్రేరణగా

స్వచ్ఛతా అవార్డులు





అమలాపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుల సభలో స్వచ్ఛత అవార్డు అందుకుంటున్న డీఆర్వో కె.మాధవి.. అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కార్మికుడు

- కలెక్టర్ మహేష్‌కుమార్
- ఘనంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం
- జిల్లాస్థాయిలో 16 కేటగిరిల్లో 49 మందికి ప్రదానం

అమలాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల మధ్య పోటీతత్వం పెంచేందుకు ప్రేరణగా స్వచ్ఛత అవార్డులు నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో సోమవారం జిల్లాస్థాయిలో 'స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం 2025' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ పంచాయతీకి అవార్డు లభించిందని, జిల్లాస్థాయిలో వివిధ కేడర్లలో స్వచ్ఛత అవార్డులను ఈ సందర్భంగా అందజేస్తున్నట్టు తెలిపారు. గుర్తింపు పొందిన మున్సిపాలిటీలు, పంచాయతీలు, స్కూళ్లు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతు బజార్లు, బస్‌స్టేషన్లు, పారిశుధ్య కార్మికులు, స్వయం సంఘాలకు చెందిన అనేకమందికి ఈ అవార్డులను జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛత, పారిశుధ్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ఘనీభవ ఆర్థిక వ్యవస్థ విధానాలను ప్రోత్సాహించేందుకు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. అవార్డుల ఎంపికలో పారదర్శకత పాటించడానికి స్వతంత్ర సంస్థల ద్వారా మూల్యాంకన చేయడం జరిగిందని, మూల్యాంకన చేయడం జరిగిందని, ముఖ్యంగా పారిశుధ్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలకు గుర్తింపు ఇచ్చి ఈ అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాల్లో అత్యుత్తమంగా కృషి చేసిన వారికి స్వచ్ఛతా యోధులు, గ్రీన్ అంబాసిడర్లను సత్కరించడం అభినందనీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షణ అవార్డుల తరహాలో జిల్లాలో ఒక వ్యవస్థను ఏర్పాటుచేసి స్వచ్ఛత ప్రమాణాలను పెంచడం ద్వారా జిల్లాను పరిశుభ్రమైన పచ్చని ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దడానికి వీలవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. డీఆర్వో కె.మాధవి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జనసేనకు చెందిన ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, సీపీవో మురళీకృష్ణ, తహశీల్దార్ ప్రసాద్‌తో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో 16 కేటగిరిల్లో ఎంపిక చేసిన 49 మందికి అవార్డులను కలెక్టర్ మహేష్‌కుమార్, డీఆర్వో మాధవి, అముడా చైర్మన్ స్వామినాయుడు చేతులమీదుగా ప్రదానం చేశారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డులను తీసుకున్న సర్పంచ్‌లు, మున్సిపల్ కార్మికులు, సంఘాల ప్రతినిధులు

విద్యార్థులకు నేడు జిల్లాస్థాయి పోటీలు

ముమ్మిడివరం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): అమలాపురం వెత్సావారి అగ్రహారంలో ఉన్న మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జీఎస్టీ వారోత్సవాలు, సేవ్ ది గర్ల్‌చైల్డ్ కార్యక్రమాలపై పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జీఎస్టీ వారోత్సవాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని, మండలస్థాయిలో మూడు విభాగాల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు మండలానికి ముగ్గురు వంతున ప్రతీ మండలం నుంచి హాజరుకావాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు సేవ్ ది గర్ల్‌చైల్డ్ కార్యక్రమానికి సంబంధించి పోటీలు జరుగుతాయన్నారు. మండలస్థాయిలో మూడు అంశాల్లో ప్రథమ స్థానం సాధించిన 22 మండలాల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఉదయం పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాశీ ఘనసత్యనారాయణ భోజన ఏర్పాట్లు చేస్తారన్నారు. మధ్యాహ్నం జరిగే పోటీకి వచ్చే విద్యార్థులకు భోజనం అవసరమైతే హెచ్‌ఎంను సంప్రదించాలన్నారు. డీఈవో షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.



ప్రయాణ బాదుడే!

ప్రైవేట్ ట్రావెల్స్ మహా దోపిడీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దసరా సెలవులు ముగిశాయి. ఊళ్లకు వచ్చిన జనం ఇంటిబాట పట్టారు. ముందుగా ప్లాన్ చేసుకున్న వాళ్ల సంగతి బాగానే ఉన్నా.. మిగతా ప్రయాణికులకు మాత్రం ప్రయాణ నరకం తప్పడం లేదు. ఒకవైపు రైళ్లలో రిజర్వేషన్లు నిండుకున్నాయి. తత్కాల్‌లోనూ ఖాళీలు లేవు. ఇదే అదనుగా మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు అమాంతం ధరలు పెంచేశారు. బెంగళూరుకు ఏకంగా రూ.5 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఓ నలుగురు ఉన్న కుటుంబం వెళితే అక్షరాలా రూ.20 వేలు చార్జీలకే అవుతోంది. ప్రైవేటు బస్సుల బాదుడుపై విశాఖపట్నం జిల్లా రోడ్డు రవాణా అధికారులు కన్నెర్ర చేశారు. ఉమ్మడి జిల్లా అధికారులు మాత్రం ఇంకా కన్ను తెరవలేదు. అత్యవసరంగా వెళ్లాలంటే అప్పు తప్పదన్నట్టు పరిస్థితి ఉంది.

గోదావరి జిల్లాల నుంచే రద్దీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తారు. ఉపాధికి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి కోనసీమ జిల్లా నుంచి ఎక్కువగా వెళుతుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాల్లో ఉన్న యువత ఎక్కువే. పండుగ వేళల్లో తమ ఊళ్లకు వస్తుంటారు. పండుగ ముగిసిన వెంటనే తిరుగు ప్రయాణం అవుతారు.అధిక శాతం రైలులోనే ప్రయాణిస్తారు. ఎందుకంటే ధర తక్కువ. అయితే రైలులో బెర్తులు నిండుకోవడంతో ప్రత్యామ్నాయం చూస్తున్నారు. దీంతో ప్రైవేటు బస్సుల వైపు చూస్తున్నారు. బస్సుల్లో బాదుడు విపరీతంగా ఉంది. దీంతో ప్రయాణ తిప్పలు తప్పడం లేదు. చెన్నై, బెంగళూరుకు ఆర్టీసీ బస్సులు లేవు. హైదరా బాద్‌కి ఉన్నా ధరలు తక్కువ వల్ల ముందుగానే రిజర్వేషన్లు పూర్తవుతున్నాయి. దీంతో ప్రైవేటు బస్సులపై ఆధారపడక తప్పడం లేదు.

మన అధికారులేం చేస్తున్నారు?

ఒకవైపు ప్రయాణికుల అవసరం, మరోవైపు అధికారులు అమ్యామ్యాల్లో మునిగి తనిఖీలు లేకపోవడం, రైళ్లలో ఖాళీలు లేకపోవడం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు వరంగా మారుతోంది. విశాఖపట్నంలో ఈనెల 2న దసరా సందర్భంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ఆ జిల్లా రోడ్డు రవాణా అధికారులు విస్తృతంగా సోదాలు చేశారు. అధిక చార్జీలు వసూలు చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి వాటిపై దృష్టి సారించారు. ఏకంగా 40 బస్సులపై కేసులు నమోదు చేశారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులు మాత్రం అసలు ఆ దిశగా కన్నెత్తి చూడలేదు.

టిక్కెట్ కొనలేక ఇక్కట్లు..

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ మితిమీరిపోయింది. ప్రైవేటు బస్సు ఆపరేటర్లు బస్సు రకాన్ని బట్టి వసూలు చేస్తున్నారు.మల్టీ యాక్సిల్, భారత్ బెంజ్, వోల్వో, స్కానియా ఇలా తయారీదారులు, సాంకేతికత పేరు చెప్పి మరీ బాదేస్తున్నారు. అయినా పట్టించుకున్నవాళ్లే లేరు. బెంగళూరుకు సాధారణంగా మామూలు రోజుల్లో టిక్కెట్ రూ.2 వేల లోపే ఉంటుంది. ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ లాగేస్తు న్నారు.హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో రూ.1200 నుంచి రూ.1500 ఉంటుంది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.4,700ల వరకు వసూలు చేస్తు న్నారు. చెన్నై అయితే రూ.1800 ఉంటుంది. ప్రస్తుతం రూ.4 వేల వరకూ ఉంది. ప్రైవేటు బస్సు టికెట్లకు గొలుసుకట్టులా ఏజెంట్లు ఉండడంతో వాళ్ల కమీషన్‌ని కూడా ప్రయాణికుల నుంచే వసూలు చేస్తుండడంతో టికెట్ ధర అమ్మో అనిపిస్తోంది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గుండా ప్రయాణించే ప్రైవేటు బస్సులకు సంబంధించి 50కిపైనే ఆప రేటర్లు ఉన్నారు. వీళ్లందరూ పండుగల వేళ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

విమానధరలు ఇలా...

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పోలిస్తే విమానయాన ధరలే కాస్త అందుబాటులో ఉన్నాయి. బెంగళూరుకు వయా హైదరాబాద్ సింగిల్‌స్టాప్ అయితే సాధారణంగా టిక్కెట్ ధర రూ.13 వేలు ఉంది.. ప్రస్తుతం రూ.20 వేలు ఉంది. డైరెక్ట్ అయితే మామూలు రోజుల్లో రూ.5000 ఇప్పుడైతే రూ. 6,000.. ఆదివారం అయితే రూ.7500ల ఉంటుంది. పండుగ సమయాల్లో ఫ్లైట్ ధరలు ఇష్టానుసారం పెంచ కుండా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నిఘా పెట్టింది. ప్రయాణికులకు తగినట్టు విమాన సామర్థ్యాలు పెంచాలని సూచించింది.

- ముగిసిన దసరా పండుగ
- ఇంటి బాట పట్టిన బంధుగణం
- ఆర్టీసీ బస్‌లు.. రైళ్లు ఫుల్..
- ప్రైవేట్ ట్రావెల్స్ ప్రత్యామ్నాయం
- రద్దీ కారణంగా టిక్కెట్ అ'ధనం'
- ప్రయాణికుల లబోదిబో

రైళ్లు ఫుల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రవాణాపరంగా గేట్‌వే రాజమండ్రి రైల్వే స్టేషను. బెంగళూరుకు ప్రత్యేక, వారాంతపు రైళ్లతో కలిపి రోజుకు 10 వరకూ రైళ్లు వెళుతుంటాయి. అయితే ఏ రైలులో కూడా టికెట్లు లేవు. హౌరా, హతియా, మాల్దా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు వచ్చే నెలలో కూడా అసలు వెయిటింగ్ లిస్ట్‌లోనూ టికెట్లు లేవు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ప్రయాణికులు రాకపోకలు సాగించే శేషాద్రి, ప్రశాంతిలో వెయిటింగ్ లిస్టు చాంతాడంత ఉంది. హైదరాబాద్ విషయానికి వస్తే రోజూ 16కిపైగా రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఎక్కువగా సుదూర ప్రాంతాల నుంచి నడిచేవి కావడంతో సాధారణ బోగీల్లో కాలు పెట్టడానికి కూడా వీలు ఉండదు. గౌతమి, గోదావరి, విశాఖ, మహబూబ్‌నగర్ రైళ్లకు వెయిటింగ్ లిస్టు 100 దాటి పరుగులు పెడుతోంది. చెన్నైకి ప్రతి రోజూ 10 వరకూ రైళ్లు అందుబాటులో ఉండగా కాకినాడ -పుదుచ్చేరి మినహా మిగతా రైళ్లలో ఎక్కడా ఖాళీలు లేకపోవడం గమనార్హం.



అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 150 అర్జీలు

అమలాపురంటౌన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 150 అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారం పట్ల అధికారులు అలసత్వం వహించరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రతీ సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహించే వేదికకు అర్జీదారులు రావాలంటే వ్యయప్రయాసలకు లోనవడంతోపాటు డబ్బు, సమయం వృథా అవుతున్న నేపథ్యంలో సచివాలయం, మండల, డివిజన్, పురపాలక సంఘ స్థాయిల్లో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారంకాని సమస్యలను మాత్రమే జిల్లా స్థాయిలో నివేదించాలని సూచించారు. అనంతరం ఇద్దరు దివ్యాంగులకు సాంకేతిక విద్యాభ్యాసం నిమిత్తం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మాధవి, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మి, డీఆర్డీఏ పీడీ గాంధీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాడపల్లి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సర్వంసిద్ధం

- 10వ తేదీ నుంచి 18 వరకు బ్రహ్మోత్సవాలు
- సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఎస్పీ మీనా



వాడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ.. చిత్రంలో ఆలయ చైర్మన్, ఈవో తదితరులు

అమలాపురం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): వాడపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను, ఉత్సవ కమిటీలను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనాతోపాటు దేవదాయశాఖకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు అన్నివిధాలా ఏర్పాట్లుచేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 11వ తేదీ, 18వ తేదీలు శనివారాలు కావడం వల్ల భక్తులు అధికంగా ఉండే అవకాశం ఉండడంతో ఆ స్థాయిలో ఏర్పాట్లు, పార్కింగ్, బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 10వ తేదీన శేషవాహన సేవ, 11న హంసవాహనసేవ, 12న హనుమద్‌వాహనసేవ, 13న సింహవాహన సేవ, 14న గరుడ సేవ, 15 ఉదయం సూర్యప్రభ వాహన సేవ సాయంత్రం చంద్రప్రభ వాహనం, 16న రాజాధిరాజ అలంకరణతో గజవాహనసేవ, 17 కల్పవృక్ష వాహనసేవ, సాయంత్రం అశ్వవాహన సేవ జరుగుతాయి. 18వ తేదీన స్వామివారి చక్రస్నానంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ సందర్భంగా భద్రతా చర్యలు పటిష్టంగా ఏర్పాటుచేయాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఎస్పీ రాహుల్‌మీనాకు సూచించారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కోసం ఏర్పాట్లు చేయాలని, కళావేదిక వరకు మాత్రమే బస్సులు నడపాలని, క్యూలైన్ల వద్ద పటిష్ఠమైన చర్యలు తీసుకుని జాగ్రత్తలు వహించాలని కోరారు. సమీక్షలో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు, డీఎస్పీ మురళీమోహన్, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ ఏజన్సీకి హార్బరు పనులు

కలెక్టర్ అధ్యక్షతన సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్

అమలాపురం,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బరు నిర్వహణను ఆర్‌ఆర్‌ఆర్ ఏజన్సీకి ఫైనలైజ్ చేస్తూ పనులు అప్పగించడం జరిగిందని, వచ్చే నెలలో పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఆధ్వర్యంలో హార్బర్ అభివృద్ధి గురించి కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. సుమారు రూ.26లక్షలతో వివిధ పనులకు అంచనాలు రూపొందించడం జరిగిందని, ఈ పనులు నవంబరు నుంచి ఆర్‌ఆర్ ఏజన్సీకి బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్, జలజీవన్ మిషన్ ద్వారా హార్బరు అవసరాల నిమిత్తం వాటరు ట్యాంకును నిర్మించాలని, ఉపాధిహామీ అనుసంధానంతో అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, విద్యుత్ సరఫరాకు విద్యుత్‌శాఖ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఒప్పందాలపై ఆర్డీవో, మత్స్యశాఖలు సంతకాలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జేసీ నిషాంతి, ఎస్పీ రాహుల్‌మీనా, డీఆర్వో కె.మాధవి, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రామన్, ట్రాన్స్‌కో ఎస్ఈ రాజకుమారి, ఆర్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



నడిపూడి వద్ద పంటకాల్వలు, డ్రెయిన్లకు సంబంధించి బ్రిటీష్‌కాలం నాటి మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

పంట కాల్వలు, డ్రెయిన్ల వెంబడి ఆక్రమణల గుర్తింపు సర్వే ప్రయోజనకరం

- కలెక్టర్ మహేష్‌కుమార్
- కాటన్ రూపొందించిన సరిహద్దుల మేరకు ప్రయోగాత్మక సర్వే
- శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆనందరావు
- తొలగింపు కార్యక్రమానికి నోడల్ అధికారిగా జేసీ నిషాంతి

అమలాపురం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నాటి మ్యాప్‌లు, సర్వే ప్రమాణాల ప్రకారం పంటకాల్వలు, డ్రైనేజీలకు సర్ ఆర్థర్ కాటన్ రూపొందించిన సరిహద్దుల ఆధారంగా సర్వే ప్రయోగాత్మకంగా నిర్వహించేందుకు సరిహద్దు రాళ్ల ఏర్పాటును అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. అమలాపురం రూరల్ మండలం నడిపూడి నుంచి సోమవారం సర్వే నిర్వహణ, సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియకు ఎమ్మెల్యే నాంది పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటకాల్వలు, డ్రెయిన్లు, నాలుగైదు నెలల్లో సర్వే పూర్తిచేసి ఆక్రమణల తొలగింపు సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామని, కొత్త జిల్లా ఆవిర్భావం కావడంతో రైతులకు సకాలంలో సాగునీరు అందించడంతోపాటు మురుగునీటి వ్యవస్థ సక్రమంగా ఉండేందుకు డ్రెయిన్లు, పంటకాల్వలను ఆక్రమణలకు గురికాకుండా అడ్డుకునేందుకు ఈ కార్యక్రమం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్య నివారణ కూడా జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో వాణిజ్య కూడళ్లలో రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలు సర్వే ప్రకారం తొలగిస్తూ పంచాయతీలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే అనంతరం బ్రిటీష్ కాలం నాటి కొలమానం ప్రకారం వంద మీటర్లకు ఒక సరిహద్దు రాయిని ఏర్పాటుచేసి ఆ స్తంభంపై ఇయర్ మార్కు పూర్తి వివరాలను రాయించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఎవరూ ఈ సర్వే రాళ్లు దాటి రాకుండా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. ఆక్రమణలు న్యాయబద్ధంగా తొలగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని, ముఖ్యంగా నడిపూడి నుంచి చల్లపల్లి వరకు ఎమ్మెల్యే సహకారంతో చేపట్టిన ఈ సర్వే విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రెండు నెలల్లో కాల్వలు, డ్రెయిన్ల గట్ల వెంబడి ఉన్న ఆక్రమణలు గుర్తించి రాళ్ల స్థాపించడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నోడల్ అథారిటీగా వ్యవహరిస్తారన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ జలవనరులశాఖ చరిత్రలోనే నిలిచిపోయేలా కలెక్టర్, జేసీ సహకారంతో నియోజకవర్గంలో అన్ని పంటకాల్వలు, డ్రెయిన్ల వెంబడి ఉన్న సరిహద్దులను మ్యాపింగ్ చేసేందుకు సర్వే చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కాటన్ ఏర్పాటుచేసిన ఈ పంట కాల్వల ఆధారంగా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించడం ద్వారా రైతులకు మేలుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన నాగమణికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీడీపీవోలు, కార్యాలయ సిబ్బంది

స్త్రీ,శిశు అభివృద్ధి, సాధికారిత అధికారిణిగా నాగమణి

ముమ్మిడివరం,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణిగా కె.నాగమణి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన బి.శాంతకుమారి పదవీ విరమణ పొందడంతో సీడీపీవో వై. విజయశ్రీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. మహిళా కమిషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగమణి పదోన్నతిపై జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణిగా నియమితులు కావడంతో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాగమణిని పలువురు సీడీపీవోలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంబాజీపేటలో రేపు విజయభేతాళ ఉత్సవం 5



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా ఏర్పాటు చేసుకున్న బండరాయిపై ధాన్యం, బియ్యం, పప్పులు ఉంచిన పావురులంక ఆదివాసీలు

"గ్రామ పెద్ద... వలస ఆదివాసీ గ్రామాల్లో ఆయన మాటే శాసనం. ఆయన నిర్ణయమే శిరోధార్యం. పండుగ జరుపుకోవాలన్నా, వ్యవసాయ పనులు మొదలు పెట్టాలన్నా, పెళ్లిళ్లు నిశ్చయించాలన్నా ఆయనదే నిర్ణయాధికారం. దానిని దాటి ఎవరైనా ఒక్క అడుగు వేసినా అపచారం. అది వారి విశ్వాసం. అటువంటి గ్రామ పెద్ద కాలం చేస్తే ఊరంతా కలిసి ఓ పెద్ద తంతే జరుపుకుంటారు. ఆయన పేరిట ఓ బండరాయిని మూడు దారుల కూడలిలో ఏర్పాటు చేసుకుంటారు. జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవాన్నే ఆ రాయికీ ఇస్తారు. దానిపై అల్లుడిని కూర్చోబెట్టి పూజ చేస్తారు. ఆ నిమిషం నుంచి గ్రామ పెద్ద ఆత్మ అతని అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం. ఇదంతా చూడ్డానికి వింతగా ఉన్నా వారి ఐక్యతకు మాత్రం ఓ పెద్ద నిదర్శనం. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పావురులంకలో ఇటీవల జరిగిన ఈ తంతు విశేషాలు తెలుసుకుందాం..."



రాయి కాదు జ్ఞాపకం

- బండరాయికి మరణించిన గ్రామ పెద్దలా గౌరవ, మర్యాదలు
- అల్లుడిలో అతడి ఆత్మ ప్రవేశిస్తుందని వారి విశ్వాసం
- రాయిపై కూర్చోబెట్టి పూజలు
- ఇదీ వలస ఆదివాసీల ఆచారం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఛత్తీస్‌గఢ్ నుంచి పలు కుటుంబాలు కొన్నేళ్ల క్రితం వివిధ కారణలతో నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కి వలస వచ్చాయి. ఆ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిలాలతో పాటు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ తదితర జిల్లాల్లో జీవనం సాగిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు ఒడిసా, మహారాష్ట్రల్లోని పలు జిల్లాలకు వలస వెళ్లాయి. వారంతా అటవీ ప్రాంతంలో గ్రామాలు ఏర్పాటు చేసుకుని పోడు సాగుతో బతుకు బండి లాగుతున్నారు. ఏ కుటుంబమైతే అందరికంటే ముందుగా వచ్చి అడవిలో నివాసం ఏర్పాటు చేసుకుని గ్రామం నెలకొల్పుతుందో ఇక అప్పటి నుంచి ఆ కుటుంబ పెద్దే గ్రామ పెద్దగా వ్యవహరించడం వారి కట్టుబాట్లలో ప్రధానమైనది. ఆ తర్వాత వలస వచ్చిన కుటుంబాలన్నీ గ్రామ పెద్ద మాటే శిరోధార్యంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో గ్రామ పెద్ద మృతి చెందితే ఊరంతా ఏకమై ఓ పెద్ద తంతే జరుపుకుంటుంటారు. దహన సంస్కారాలు పూర్తయిన నెల రోజులకు ఊరిలోని వారంతా సమీపంలోని అడవిలోకి వెళ్లి కాసింత పలచగా, పలకలగా ఉన్న బండరాయి కోసం అన్వేషిస్తారు. వారు అనుకున్న మాదిరి బండరాయి లభ్యం కాగానే దానిని జడ్డీపై మోసుకుని ఆ ఊరికి చేరుకునే మూడుదారుల కూడలికి తీసుకొస్తారు. (సహజంగా వలస ఆదివాసీ గ్రామం చేరుకోవాలంటే మూడు, అంతకు పైనే కాలిబాటలు ఉంటాయి). అలా చేరుకున్నాక ఆ బండరాయి జడ్డీపై మృతి చెందిన గ్రామ పెద్ద మేనల్లుడినో లేదా కూతురు భర్తనో ఎక్కించుకుని కూడలి చుట్టూ ఐదు పర్యాయాలు ప్రదక్షిణ చేస్తారు. ఆ సమయంలో బండరాయి జడ్డీపై కూర్చున్న అల్లుడు డోలు కొయ్య వాయిస్తాడు. ఐదుసార్లు ప్రదక్షిణ జరిపాక జడ్డీని కిందకు దింపుతారు. అనంతరం మహిళలంతా కలిసి బండరాయిపై కూర్చున్న అల్లుడికి పసుపు పూసి బిందెలతో తలపై నీళ్ల పోస్తారు. ఈ తంతు ముగిసాక మృతి చెందిన గ్రామ పెద్ద కుటుంబీకులు, బంధువర్గం బండరాయిపై కూర్చున్న అల్లుడి కండువా చెంగులో రూపాయి నుంచి ఐదు రూపాయల వరకు పెడతారు. అప్పటినుంచీ కాలం చేసిన గ్రామ పెద్ద ఆత్మ ఆ బండరాయిపై కూర్చున్న అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం.



జడ్డీపై తీసుకొస్తుండగా డోలు వాయిస్తున్న గ్రామ పెద్ద అల్లుడు

ఈ తంతు ముగిసాక బండరాయిని మహిళలు శుభ్రంగా కడిగి పసుపు బొట్లు పెడతారు. ఆ బండరాయిపై ధాన్యం, పప్పులు, చుట్ట... ఇట్లా కొన్ని వస్తువులు ఉంచి



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా మూడు రహదారుల కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న బండరాయిని శుభ్రం చేస్తున్న కుటుంబీకులు

మూడుదారుల కూడలిలో ఉంచుతారు. ఆ క్షణం నుంచీ ఆ రాయికి జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవ మర్యాదలే ఇస్తారు. ఆ రోజు నుంచి గ్రామానికి చెందిన ఎవరైనా సరే వేరే ఊరు వెళ్లి వస్తున్నా, సంతకు వెళ్లి వస్తున్నా ఆ మూడుదారుల కూడలి వద్ద కొద్ది నిమిషాలు పాటు ఆగి గ్రామ పెద్ద పేరిట నెలకొల్పిన బండరాయిపై ఆయనకు ఇష్టమైన తినుబండారాలు గానీ, చుట్ట-బీడీ గానీ, సారా, కల్లు గానీ ఉంచి దండం పెట్టుకుంటుంటారు. ఈ తంతు కేవలం ఊరి పెద్దకు మాత్రమే జరుపుతారు. అంటే ఈ తరహా గౌరవం గ్రామ పెద్దకు మాత్రమే పరిమితమన్న మాట. ఇతరులెవ్వరూ మృతి చెందినా సాధారణ కార్యక్రమాలే నిర్వహిస్తారు.


చూడ చక్కని వేడుక...
13 వాహనాల కలయిక

- అంబాజీపేటలో రేపు విజయభేతాళ ఉత్సవం
- అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు

అంబాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయభేతాళ ఉత్సవం... అనగానే ముందుగా గుర్తుకొచ్చేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట. శరన్నవ రాత్రుల్లో భాగంగా ఇక్కడ 58 సంవత్సరాలుగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. 59వ వార్షికోత్సవాన్ని అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. అనుకున్న లక్ష్యం సాధించేందుకు భేతాళుని పూజించడం ఇతర దేశాల నుంచి అనాదిగా వస్తున్న సంప్రదాయం. కలశస్థాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం పది రోజులు కొనసాగింది. అమ్మవారితో పాటు భేతాళునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వాహనాలను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించి దైవ రూపాలను పురవీధుల్లో ఊరేగిస్తూ అంబాజీపేట సెంటరుకు చేరుకుంటారు. చెడీతాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటాలతో యువకులు చేసే విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తాయి.




విజయ భేతాళస్వామి



పోటాపోటీగా వాహనాల ముస్తాబు...

భేతాళస్వామి ఉత్సవంలో 13 వాహనాలు పాల్గొంటాయి. వీటిని వివిధ రకాల ఫల, పుష్పాలు, విద్యుద్దీపాలతో పోటాపోటీగా ముస్తాబు చేస్తున్నారు. శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారి పాలేల నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి దుర్గమ్మవారు, దొమ్మేటి వారిపాలెం (పాత పోస్టాఫీసు) నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుండి షిర్డి సాయిబాబా, గుత్తుల వారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజ రాజేశ్వరీదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు కొలువుదీరనున్నాయి.





అధునాతన టెక్నాలజీతో బందోబస్తు

సీఐ భీమరాజు



ఉత్సవంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో అధునాతన టెక్నాలజీతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. సీఐ, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.



సీఎం చంద్రబాబు నుంచి అవార్డును అందుకుంటున్న లొల్ల సర్పంచ్ జగన్నాథం

స్వచ్ఛ అవార్డులు

పంచాయతీ విభాగంలో లొల్ల... రెసిడెన్షియల్ విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పారిశుధ్య నివారణలో లొల్ల గ్రామం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబుచేతులు మీదుగా లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి కృష్ణామాచార్యులు స్వచ్ఛ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సర్పంచ్ జగన్నాథంను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు అభినందించారు.

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్..

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూల్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ప్రిన్సిపాల్ సీహెచ్ఎంజీ పరిమళకు స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ (స్టేట్) అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం చేశారు. సోమవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో స్వచ్ఛ అవార్డును బహూకరించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణ ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించినందుకు రాష్ట్రస్థాయిలో రెసిడెన్సియల్‌స్కూల్స్ విభాగంలో అవార్డు వచ్చింది.



స్వచ్ఛ బస్టాండ్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న వైవీఎస్ఎన్ మూర్తి



ఎంఎస్ఎంఈ కేటగిరిలో ఎలైట్ ఇన్‌స్ట్రుమెంట్ సంస్థ



స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరిస్తున్న అదనపు కమిషన్ రామలింగేశ్వర్



రెసిడెన్షియల్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ పరిమళ

అందరికీ తాగునీటి భద్రత ప్రభుత్వ లక్ష్యం

ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఇషాన్‌బాషా

సామర్లకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు రానున్న మూడేళ్లలో పూర్తి చేసుకోవాలని గ్రామీణ నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించాలన్న ప్రధానోద్దేశ్యంతో గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటిపా రుదల విభాగం ఏఈఈలు,డిప్యూటీ ఎంపీడీవోల తొలి బ్యాచ్ శిక్షణా తరగ తులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో బాషా సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్వో కేంద్రాల నీటి వినియోగం బాగా పెరిగిపోయిందని, దీని వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ మూడు రోజులకు ఒక బ్యాచ్ చొప్పున సబ్జెక్ట్ నిపుణులతో రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ శిక్షణలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 40 మంది ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. సోమవారం నుంచి ప్రారంభమైన శిక్షణాతరగతులకు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి 402 మంది హాజరయ్యేందుకు శిక్షణా తరగతులు ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇవి పూర్తయ్యాక గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కూడా శిక్షణ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీన్, విశ్రాంత ఎస్ఈ ఉమాశంకర్, పెద్దాపురం డీఈ స్వామి, ఈఈశ్రీరామ్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో మెగా ఫుడ్ ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం వర్సిటీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూనివర్శిటీ కాలేజీలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకులతో ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమై చక్కని రుచులు, అభిరుచులకు వేదికైన గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా ఈ ప్రాంత ప్రజల వంటకాల మాధుర్యాన్ని, గొప్ప తనాన్ని ఇనుమడింపజేయడానికి గానూ ఈ నెల 14, 15,16 తేదీల్లో మెగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి సిబ్బంది, విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ దీనిలో భాగస్వామ్యం కావచ్చన్నారు. మెగా ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి 14న క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తామన్నారు. 15,16 తేదీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ వర్సిటీ పరిధిలోని ఆసక్తి కలిగిన వారంతా వంటలు సిద్ధం చేసుకుని యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చన్నారు. విభిన్న రుచులతో ఆరోగ్యకరమైన, సంప్రదాయ వంటలను ప్రదర్శించిన వారికి 16న బహుమతులు ప్రదానం చేస్తామని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపికలు



సెలక్షన్స్‌లో ఎంపికైన జిల్లా కరాటే జట్టుతో అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి బాలురు, బాలికల సెలక్షన్స్ పూర్తయ్యాయి. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఫుట్‌బాల్, కరాటే పోటీలకు సంబంధించిన ఎంపికలు చేపట్టారు. ఈ సెలక్షన్స్‌ను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జోన్-2 జాన్సన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జిల్లా టీం, స్టేట్ పోటీల్లో సత్తా చాటి మెడల్స్ తీసుకురావాలని కోరారు.ఎంపికలను డీఈవో కార్యాలయం ఏడీ వెంకట్రాజు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు ఏవీడీ ప్రసాదరావు, భువనేశ్వరి, తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు పర్యవేక్షించారు.

నెట్‌బాల్ పోటీలకు ముగ్గురు..

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రే యపురం మండలం ర్యాలి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆత్రేయపురంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. సీనియర్ విభాగంలో భవ్యరేఖ, రమాదేవి జూనియర్ విభాగంలో సుస్మిత ఎంపికైనట్టు హెచ్ఎం ఎన్.సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వ్యాయామోపాధ్యాయులు నాగబాబు, సుబ్బారావు, పాఠశాల చైర్మన్ సీహెచ్ దుర్గారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-17కు ఇద్దరు..

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 సైక్లింగ్, మోడరన్ పెంటథలాన్ పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఇమ్మంది సత్యహరిని, దేవాది అలేఖ్య ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీ డి.యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెజ్లింగ్‌కు ఇద్దరు..

రాజోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17 విభాగం నుంచి మట్టపర్తి బాల వంశీ, అండర్-14 విభాగం నుంచి అప్పారి ఓం సాయిచరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.కుమార్‌చందు శ్రీధర్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపికైనట్టు హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణ తెలిపారు. శ్రీధర్ వెయ్యి మీటర్ల పోటీల్లో స్వర్ణం, 3వేల మీటర్ల పోటీలో కాంస్య పతకం సాధించాడు. శ్రీధర్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు.



శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు


భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ 1.48 కోట్లు

అన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,48,77,775 నగదు, 62గ్రాముల బంగారం, 345 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 76 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, యుఏఈ 20 దిరహమ్స్ లభించాయి. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా దేవస్థానం సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు లెక్కించారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.25 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్నారు.

గుడ్ ఈవినింగ్ క్లిక్..



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరిపై రోడ్డు కం రైల్వే బ్రిడ్జి ఎప్పటికప్పుడు ప్రత్యేకంగానే కనిపిస్తుంది. సోమవారం సూర్యాస్తమయం సందర్భంగా కనిపించిన అందమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సినిమా చూసి వస్తుండగా విషాదం

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు


మరణించిన కుశరాజు

గొల్లప్రోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.జగ్గంపేట గ్రామానికి చెందిన గెద్దం లోవకుమార్ శంఖవరం గ్రామానికి చెందిన బంధువు పడాల కుశరాజు (26)తో కలిసి మోటార్‌సైకిల్‌పై ఆదివారం రాత్రి పిఠాపురంలో సినిమా చూసేందుకు వెళ్లారు. సినిమా చూసి తిరిగి వస్తుండగా గొల్లప్రోలు వద్దకు వచ్చేసరికి అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కుశరాజు మరణించాడు. తీవ్రంగా గాయపడిన లోవకుమార్ చికిత్స పొందుతున్నాడు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన కామరాజు

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప నక్కావారిపేటలో బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం తుమ్మలపల్లికి చెందిన ఉల్లం కామరాజు కరపలోని బంధువుల ఫంక్షన్ వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక నక్కావారి ఎస్సీపేటలో శిథిలస్థితిలో ఉన్న వంతెనను దాటుతూ అదుపుతప్పి కిందపడిపోయాడు. కామరాజు ముఖానికి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108 అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీసులు విచారణ చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామ శివారులో పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కె.సాయి అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో అతడి తల, చేతులకు గాయాలయ్యాయి. సాయి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. స్థానిక పోలీసులు చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌పై రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన ప్రమాదం

హైవే డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిన ఆటో

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై సోమవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వెనుక టైర్ పంచర్ కావడంతో డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగింది. ఆటో డ్రైవర్ చాకచక్యంగా ఆపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా కొడితే పెద్ద ప్రమాదం జరిగేదని వారు భయపడ్డారు.


గండేపల్లి హైవేపై ఆగిన ఆటో

నాన్న... మాకు దిక్కెవరూ!

తాండవ నదిలో పడి పశువుల కాపరి మృతి

అనాథలైన ఇద్దరు చిన్నారులు


ఫైల్‌ఫొటో


భీమరాజు మృతదేహం


బాధలో ఇద్దరు చిన్నారులు

తుని రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో మునిగి పశువుల కాపరి మృతిచెందాడు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. తుని రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరి లోవ గ్రామానికి చెందిన మండల భీమరాజు (35) పశువులను మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే సోమవారం తాండవ నది తీరాన పశువులు మేపుతూ ఆటు గట్టు వైపు నుంచి ఇటు గట్టుకు పశువులను తరుముతున్న క్రమంలో తాండవ నదిలో నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసినట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

ఏడాది కిత్రమే భార్య మృతి...

భీమరాజు భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. ఇద్దరు ఆడపిల్లలను సాకుతూ పశువులే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న భీమరాజు మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పశువులను తీసుకెళ్లిన తండ్రి విగతజీవిగామారడంతో కన్నీరుమున్నీరయ్యారు.

దారిలో దంపతులను మింగిన మృత్యువు

కారు ఢీకొని భార్యాభర్తల మృతి

కోటపాడు ఏడీబీ రోడ్డులో ఘటన


మృతిచెందిన దంపతులు గణేష్, వీరలక్ష్మి

రంగంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను కారు బలంగా ఢీకొనడంతో దంపతులు మృతిచెందిన సంఘటన సోమవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కోటపాడు ఏడీబీ రోడ్డు శ్రీరామ్‌ఫామ్స్ వద్ద జరిగింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణానికి చెందిన కర్రి గణేష్(45) వాలుతిమ్మాపురం లలిత రైస్‌మిల్లులో గోనెసంచులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి భార్య కర్రి వీరలక్ష్మి(40) రంగంపేట మండలం కోటపాడులోని బీరు ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. వీరలక్ష్మిని బీరు ఫ్యాక్టరీ వద్ద దించేందుకు సోమవారం ఉదయం 7.30 గంటలకు గణేష్ మోటార్‌సైకిల్‌పై సామర్లకోట నుంచి వెళ్తుండగా కోటపాడు ఏడీబీ రోడ్డులో శ్రీరామ్ ఫామ్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రంగంపేట వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన భార్యాభర్తలను స్థానికులు 108 అంబులెన్స్‌లో పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాపారి హత్య

అలస్యంగా వెలుగులోకి ఘటన


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏలేశ్వరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.కొత్తూరు గ్రామానికి చెందిన అపరాల వ్యాపారి బొది రెడ్డి వెంకటేశ్వర్లు (69) హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లకు భార్య సత్యవతి, కుమారుడు ఆంజనేయులు ఉన్నారు. కుమారుడు ఏలేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. విజయ దశమి పండుగ నేపథ్యంలో ఈనెల 2న వెంకటేశ్వర్ల దంపతులు కొడుకు వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో కారులో వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వర్లను బయటకు తీసుకెళ్లాడు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, వెంకటేశ్వర్లు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు ఏలేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బుదరాట అటవీప్రాంతం లో మృతదేహం ఉందని అక్కడి పోలీసులు ఏలేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలానికి వెళ్లి ఆ మృతదేహం వెంకటేశ్వర్లుగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. తర్వాత వారు వెళ్లి నిర్ధారించారు. దాంతో ఏలేశ్వరం పోలీసులు అదృశ్యం కేసును హత్యకేసుగా మార్పు చేశారు. విచారణ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. అయితే వెంకటేశ్వర్లును ఏలేశ్వరం గొల్లలమెట్టకు చెందిన రాజా రమేష్ హత్య చేశాడని వెంకటేశ్వర్లు కొడుకు ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన తండ్రికి వ్యాపారం నిమిత్తం ఎవరితోనూ విభేదాలు లేవని, కేవలం తన వంటిమీద ఉన్న రూ.10లక్షల విలువ చేసే బంగారం, ధనం కోసం మాత్రమే హత్య చేసి ఉంటాడని పోలీసులకు చెప్పాడు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న రాజా రమేష్ అడ్డతీగల మండల పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.

ఆటో డ్రైవర్, ప్రయాణికులపై దాడి

కేసు నమోదు


రాయవరంలో సంఘటన వివరాలు తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌తోపాటు ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించి పలువురు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాక సావరం గ్రామానికి చెందిన అనసూరి శ్రీను, అన్నపూర్ణేశ్వరి దంపతులు హైదరాబాదులో పనిచేసుకుని జీవిస్తున్నారు. వారికి చింతపల్లి సత్యసాయి ప్రసన్న, కీర్తన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయి ప్రసన్నను వెదురుపాక సావరం గ్రామంలోని వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం సాయిప్రసన్న ఐదునెలల బాలింత. ఆమెతో పాటు చంటిబిడ్డను వి.సావరంలోని అత్తవారింటి వద్ద అప్పగించడానికి ఈనెల 5న హైదరాబాదులో బయలుదేరారు. సోమవారం వేకువజామున మాచవరం సెంటర్‌లో బస్సు దిగారు. అక్కడ నుంచి వి.సావరం చేరుకునుందుకు అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణ ఆటోను మాట్లాడుకున్నారు. మాచవరంలో బస్సు దిగి ఆటో కోసం అనసూరి కీర్తన, సాయిప్రసన్న వేచిచూస్తుండగా తమ కారు ఎక్కాలని, తనపేరు వంశీ అటూ ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి ఇబ్బంది పెట్టాడు. ఈ లోపు ఆటో డ్రైవరు వారి వద్దకు చేరుకుని శ్రీను అతడి కుటుంబసభ్యులను ఆటో ఎక్కించుకుని బయలుదేరాడు. సోమేశ్వరం శివాలయం వద్దకు వచ్చేసరికి వంశీ మరికొందరు వ్యక్తులు కారులో వచ్చి ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణపై దాడి చేశాడు. ఆటోలో ఉన్న అన్నపూర్ణేశ్వరి అడ్డుకోగా ఆమెపై దాడికి పాల్పడి ఆమె భర్త శ్రీనుపై దాడి చేసినట్టు బాధితులు తెలిపారు. ఆ వ్యక్తులు తమను పక్కకు నెట్టి వేశారని ప్రసన్న, కీర్తన ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో రాయవరం హెచ్‌సీపీ వీర్రాజు కేసు నమోదు చేశారు.

కారులో వచ్చి కొట్టుకెళ్లారు!

అమలాపురంలో వరుస దొంగతనాలు

ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ఆదివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. కారులో వచ్చి మరీ దొంగలు పడ్డ ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిని ఆనుకుని ఎర్రవంతెన సమీపంలోని కొల్లూరి బిల్డింగ్ మార్ట్, ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని పవన్ మారుతీ కేర్‌లలో దొంగలు పడ్డారు. ఆయా షాపుల యజమానులు జయన గణేష్, కొల్లూరి గుప్తా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. షాపుల తాళాలు పెకిలించడం, గోడలు పగులకొట్టి మరీ చోరీలకు పాల్పడడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కారులో వచ్చి మరీ యువకులే ఈ చోరీలకు పాల్పడినట్టు భావిస్తున్నారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. కొంతమేర నగదుతో పాలు విలువైన వస్తువులను అపహరించుకుపోయినట్టు యజమానులు చెప్పారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

గోపాలపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుకు సంబంధించిన ఇద్దరికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించినట్టు ఎస్ఐ టీ.మనోహర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పీ.శివసుబ్రహ్మణ్యం, మరపట్ల రాజ్‌కుమార్‌పై డీలక్స్ మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కోర్టులో వారికి రిమాండ్ విధించారన్నారు. దీనిపై చార్జ్‌షీట్ వేయగా కొవ్వూరు రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి కే.నాగలక్ష్మి ఒక్కొక్కరికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ డీ.బాబూరావు వాదన వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ ఎస్.భాను ప్రాసిక్యూషన్‌కు సహకరించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఓట్ల చోరీతోనే బీజేపీకి అధికారం

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం


కాకినాడలో మీడియాతో మాట్లాడుతున్న జేడీ శీలం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు దఫాలుగా ఓట్ల చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీకి ఎన్నికల కమిషన్ కొమ్ము కాస్తోందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ధ్వజమెత్తారు. సోమవారం ఆయన కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఆగడాలు ఇంకెంతో కాలం సాగవన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై నిగ్గు తేల్చాలని రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు 5కోట్ల సంతకాల సేకరణ చేపట్టామన్నారు. త్వరలోనే ఈ సంతకాల మెమోరాండాన్ని రాష్ట్రపతి, ఎలక్షన్ కమిషన్‌కు సమర్పిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజల ఓటు హక్కును దోచుకుంటోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు, ఏపీసీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మ, కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు,సత్యానందరావు ఉన్నారు.

స్థలం లీజు విషయంలో మోసం చేశారు

నాకు ప్రాణహాని ఉంది : పిఠాపురం మహారాజా తనయుడు రామరత్నారావు

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా కోట స్థలం లీజు విషయంలో ప్రముఖ విద్యా సంస్థల అధినేత తనను మోసం చేశారని, ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందని మహారాజా తనయుడు రాజా రావు రామరత్నారావు తెలిపారు. మంగళవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తాను కోటకు చెందిన 2 ఎకరాలను కేవలం మూడేళ్లకు మాత్రమే లీజుకి ఇచ్చానని తెలిపారు. తనను మోసగించి దానిని 30 సంవత్సరాలుగా మార్పు చేయడంతో పాటు స్థలాన్ని నాలుగు ఎకరాలకు పెంచి తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరో పించారు. దీనిపై తాను గతంలోనే పిఠాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా పోలీసులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు చెప్పారు. మహారాజా వారసుడిగా తనకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించ్లేదన్నారు. ఈలోగా విద్యాసంస్థల అధినేత అనుచరులు కొందరు తనను హత మార్చేందుకు కుట్ర చేస్తున్నారని, తనకు ప్రాణరక్షణకల్పించాలని ఆయన కోరారు.

దాడి కేసులో ముగ్గురి నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుల మధ్య తలెత్తిన వ్యాపారా విభేదాలతో చాకుతో దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో భావనారాయణ స్వామి ముఖద్వారం వద్ద బాలాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, కృపా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తు న్నారు. ఈ రెండింటి మధ్య వ్యాపారాల లావాదేవీల నడుమ ఆగస్టులో ఇరువర్గాల మధ్య తగాదా జరగడంతో రెండు పక్షాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 4వ అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడం, పితాని నవీన్ కుమార్‌పై తుట్టా వెంకట బాలాజీ ఉల్లిపాయలు కోసే చాకుతో దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. నిందితుల కోసం గాలిస్తూ సోమవారం ఉదయం బాలాజీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని తెలిపారు.

శ్రీ సంస్థానం భూములకు కౌలు వేలం పూర్తి

తొండంగి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగిలో ఉన్న పిఠాపురం శ్రీ సంస్థానం భూముల కౌలు వేలం పాటలు సోమవారం పూర్తయ్యాయి. ఉదయం ఆరు ప్రతులకు వేలం నిర్వహించారు. కౌలు రైతులు హైకోర్టుకు వెళ్లడంతో వేలం సాయంత్రం 5 గంటల్లోపు నిర్వహించాలన్న కోర్టు ఉత్తర్వులు 3గంటలకు అందడంతో మధ్యాహ్నం మిగిలిన ఆరుప్రతులకు వేలం పూర్తి చేశారు. 12 ప్రతులకు సంబంధించి 57.80 ఎకరాల్లో 11 ప్రతులకు 52.80 ఎకాలకు వేలం పూర్తయ్యింది. ఒక ప్రతికి చెందిన 5 ఎకరాలకు గత కౌలు కంటే తక్కువకు పాట వెళ్లడంతో దానిని వాయిదా వేశారు. వేలం పాటలు జరిగిన 11 ప్రతులకు సంబంధించి గత శిస్తు రూ.3,55,600 కాగా ప్రస్తుం అది రూ.6,08000కు చేరింది. గతం కంటే ఏడాదికి రూ.2,52,400 అదనంగా పెరిగింది. పర్యవేక్షణాధికారి బి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈవో శివబాబు, ఎం.భద్రరావు, డి.శ్రీనివాస్, రఘుబాబు, నాగబాబు పాల్గొన్నారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు కృష్ణమాచారి, జగన్మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

హై ఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

మామిడికుదురు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హై ఓల్టేజీ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవ కృష్ణశర్మ కాలనీలో సోమవారం పలు ఇళ్లల్లో గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు 30 ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు, ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తాము నిద్రలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని, తీవ్ర భయాందోళనకు లోనయ్యామని, పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీసినట్టు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తిప్పలు తప్పవా?

సమస్యల వలయంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి


వీల్‌చైర్ కదలకపోవడంతో కుంటుకుంటూ ఇలా...


వాడకానికి దూరంగా మూలకు చేరిన వీల్ చైర్


స్ట్రెచర్‌పై అతి కష్టంపై రోగిని మార్చి తీసుకెళ్తున్న రోగి సహాయకులు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) పరిస్థితి దారుణంగా తయారైంది. అడుగుపెట్టడంతోనే తిప్పలు ప్రారం భవుతున్నా యి. స్ట్రెచర్, వీల్ చైర్లు అందుబాటులో ఉండడం లేదు. స్ట్రెచర్ బేరర్ ఊసే లేకపోవడంతో రోగితో వచ్చిన సహాయ కులే తంటాలు పడాల్సి వస్తోంది. వీల్ చైర్లు అవసాన దశకు చేరి మొరాయిస్తుండ డంతో రోగులు కుంటు తూ, వేరొకరి సహాయంతో కష్టంగా వైద్యుడి వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ తిప్పలు అత్యవసర వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. వీల్‌చైర్లు, స్ట్రెచర్ల నిర్వ హణకు ఉద్యోగిని కేటాయించినా సొంత పనులకు సొంతమ య్యారు. ఆస్పత్రికి ఒక డిప్యూటీ కలెక్టర్‌ని ప్రత్యేక అధికారిని నియమించారు. వారానికి రెండుసార్లు ఆయన ఆస్పత్రికి రావాలి. రోగుల బాధలు వినాలి. కానీ ఏదైనా ఘటన జరిగినప్పుడే ఆయన అలికిడి కనిపిస్తుందనే విమర్శలు ఉన్నాయి. 2022 డిసెంబరు 21న వైద్య విద్య డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం అత్యవసర రోగులను రిసీవ్ చేసుకోడానికి ఆస్పత్రి ప్రవేశం/క్యాజువాలిటీ వద్ద రెండేసి చొప్పున స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ఒక్కొక్కరు చొప్పున ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, డాక్టరును నిరంతరం అందుబాటులో ఉంచాలి. కానీ ఆదేశాలను కూడా నిర్వీర్యం చేశారు. ఈ తీరు ప్రభుత్వంపై జనాల ఆగ్రహానికి కారణమవుతోంది. ఇక దాతలు ఇస్తున్న స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఏమవు తున్నాయో తెలియదు. కొత్త కలెక్టర్ అయినా పెద్ద మనసుతో ఆస్పత్రిపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరిస్తారని రోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

-రాజమహేంద్రవరం, (ఆంధ్రజ్యోతి)

అమలాపురం

బలరామ్మూర్తికి సత్కారం

అంబాజీపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో దళిత సాహితీ తేజాలు జాతీయ సాహిత సదస్సులో పాల్గొన్న కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి, సహజ కవి వెంకట్ పొలమూరిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

అంబాజీపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నందంపూడి ముహర్తాల చెరువు పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జట్పీటీసీ బూడిద వరలక్ష్మి సోమవారం భూమిపూజ చేశారు. అలాగే ఇరుసుమండలో డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మోకా ప్రకాష్, సర్పంచ్ పితాని మంగాదేవి, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ(పెద్ద), పితాని వీరాస్వామి, ఎంపీటీసీ బూడిటి సత్యనారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర అభినందనీయం

● ఆర్ఎస్ఎస్ ప్రతినిధి పాపాయశర్మ



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ప్రతినిధి రాళ్ళపల్లి పాపాయశర్మ

ఐ.పోలవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఐ.పోలవరంలో ఆర్ఎస్ఎస్ శతజయంత్యుత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రతినిధి రాళ్ళపల్లి పాపాయ శర్మ సేవా కార్యక్రమాలను వివరించారు. 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ 2025 విజయదశమి నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంది. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలోను గృహ సంపర్కం, హిందూ సమ్మేళనాలు, సద్భావన సమావేశాలు నిర్వహించనున్నట్టు పాపాయశర్మ తెలిపారు. భారత్- పాకిస్తాన్, భారత్-చైనా యుద్ధ సమయాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సైనికులకు సహకరించారని అన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు చంటిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, ఆర్ఎస్ఎస్ జిల్లా గ్రామీణ వికాస్ సంయోజక్ సలాది శ్రీనివాసరావు, సాగిరాజు బాపిరాజు, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, బొంతు కనకారావు, పేరాబత్తుల రామకృష్ణారావు, ఏలూరి రాంబాబు, గొలకోటి వెంకటరెడ్డి, సానబోయిన రాంబాబు, సఖిరెడ్డి శ్రీనివాస్, మామిడాల వీర వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం



టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటోవాలాలకు రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం అందించినందుకు సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కృతజ్ఞతా పూర్వక కార్యక్రమం నిర్వహించారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నల్లా స్వామి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుసుమ సూర్యమోహనరావు, జిల్లా అధికార ప్రతినిధి కాశిన జయనాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, పట్టణ అధ్యక్షుడు పట్నాల రమణ, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొంతు బాలరాజు, బూసి సోమన్న పాల్గొన్నారు.

ఎన్టీఆర్, కోన విగ్రహాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

యానాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యానాం జాతీయ రహదారిని ఆనుకుని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.టి.రామారావు, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నారు. రీజెన్సీ పరిశ్రమల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు పలు ప్రాంతాలను పరిశీలించారు. బైపాస్ ప్రాంతం, రవి జూనియర్ కళాశాల సమీప ప్రదేశం, సుంకరపాలెం బైపాస్, జీఎంసీ బాలయోగి వారధి ప్రారంభం ప్రాంతాలను పరిశీలించారు. 1200కిలోల బరువు 12.5అడుగుల ఎత్తు గల ఎన్టీఆర్ విగ్రహం సిద్ధమైంది. నవంబరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరిస్తారని నాయుడు తెలిపారు. సోమవారం కొత్తపేటలో శిల్పి ఉడయార్ తయారుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని నాయుడు పరిశీలించారు. యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు, చింతా కొండలరావు, టీపీఎస్ఎస్పీ ప్రసాదరావుపాల్గొన్నారు.

నదీ కోత నివారణకు కృషి

అయినవిల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీకోత నివారణకు కృషి చేస్తానని, సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం పొట్టిలంకలో జనసేన నాయకులు కమిడి నవీన్ సోదరుడి కుమార్తె అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను ఇంటి వద్ద పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నదీకోత విషయంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేయగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

అల్లవరం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): యెంట్రుకోన, అల్లవరం గంటాలమ్మ గుడిసెంటర్లలో సోమవారం దసరా ఊరేగింపులు జరిగాయి. చెడీ తాలింఖానా, బ్యాండు మేళతాళాలతో కనకదుర్గమ్మవారిని ఊరేగించారు. బాణసంచా కాల్పుల నడుమ జరిగిన ఊరేగింపులో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలింపు చర్యలు!

డంపింగ్‌యార్డును పరిశీలించిన మల్లాడి



యార్డు వద్ద మాట్లాడుతున్న మల్లాడి

యానాం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): యానాంలో ఉన్న డంపింగ్ యార్డును డిసెంబరు 9వ తేదీ నాటికి వేరే చోటకు తరలిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈప్రయత్నం ఎంత వరకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ కోర్టును ఆశ్రయించినట్టు ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. సోమవారం యానాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉన్న డంపింగ్ యార్డును స్థానిక ప్రజలతో కలిసి మల్లాడి పరిశీలించారు. యానాం శివారు పందులలంకలో రెండు ఎకరాల్లో డంపింగ్ యార్డు పెట్టడానికి భూయజమాన్ని ఒప్పిస్తే అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. దరియాలతిప్ప-గిరియాంపేట మధ్యనున్న ఆర్ఐటీ కళాశాల శివారు ఐదు ఎకరాల భూమి స్వాధీనం చేసుకోడానికి సీఎస్, కలెక్టర్ రెండు నెలల క్రితం చర్యలు తీసుకుంటే, దీనిని రీజెన్సీ యాజమాన్యం వ్యతిరేకిస్తుందని మల్లాడి చెప్పారు. డంపింగ్ యార్డు ఏర్పాటును కోర్టు ద్వారా అడ్డుకుంటామని యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పెండెం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అవార్డు



మలికిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మలికిపురం అడబాల వారి గ్రూపు అంగన్‌వాడీ కార్యకర్త కె.స్వాతికి అవార్డు లభించింది. అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నుంచి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్ ఇందిర, సూపర్‌వైజర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కాన్వెంట్ అధినేతకు లైఫ్‌టైమ్ అవార్డు

ముమ్మిడివరం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం శ్రీబాలాజీ విద్యా సంస్థల అధినేత టీవీఎస్ శాస్త్రికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. రాష్ట్రస్థాయి ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ వారు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రికి అవార్డు ప్రదానంచేసి సత్కరించారు. కార్యక్రమంలో అన్ని జిల్లాలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని శాస్త్రిని అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె

అల్లవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. విశాఖ కార్పొరేట్ ఆఫీసు ముట్టడిలో భాగంగా అల్లవరం ఏఈ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చలో విశాఖపట్నం ధర్నాకు తరలివెళ్లారు. విద్యుత్ లైన్‌మెన్లు, ఏఎల్ఎంలు, కాంట్రాక్టు ఉద్యోగులు, విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసు ముట్టడికి తరలివెళ్లారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

మామిడికుదురు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు 2.0పై నగరంలో వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈర్యాలీలో సర్పంచ్ జాలెం రమణకుమారి మాట్లాడుతూ జీఎస్టీని రెండు శ్లాబ్‌లకు తగ్గించడంతో నిత్యావసరాల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూనపరెడ్డి సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ తదితరులు

రీసర్వేను ఉపయోగించుకోండి

మలికిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మూడో దశలో జరుగుతున్న రీసర్వేను భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ టి.శ్రీనివాస్ అన్నారు. లక్కవరం పంచాయతీ వద్ద అవగాహన గ్రామసభ నిర్వహించారు. భావి తరాలకు రీసర్వే ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ కె.పుష్పకుమారి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, మండల సర్వేయర్ మధుసూదనరాజు, కార్యదర్శి ఎంవీ అబ్బాస్‌అలీ, ఉపసర్పంచ్ ఉలిశెట్టి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు గంటా నాయుడు, మంగెన నరసింహారావుపాల్గొన్నారు.

కాన్షీరామ్ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

పి.గన్నవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో ఈనెల9న నిర్వహించే బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి కొల్లాబత్తుల సత్యం కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కాన్షీరామ్ 19వ వర్ధంతి సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూషి జాన్ మోషే, జిల్లా ఉపాధ్యక్షుడు జిత్తుగ సత్యనారాయణ, జిల్లా జనరల్ కార్యదర్శి గిడ్డి ప్రియదర్శిని, కాండ్రేగుల గంగరాజు, నియోజకవర్గ ఇంచార్జ్ కుసుమ వెంకటేశ్వరరావు, తాడి రాంబాబు, ములపర్తి చందు, నెల్లి బాలు, దాకే విద్యాసాగర్, నాగాబత్తుల శ్రీనుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అమలాపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వన్నెచింతలపూడిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత స్థానిక సొసైటీ బిల్డింగ్‌పై షెడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో టీడీపీ స్థూపాన్ని ఆవిష్కరించారు. గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, సర్పంచ్ నక్కా రాజారత్ననాగవేణి, నాయకులు దంతులూరు వాసురాజు, చొల్లంగి సత్యసాయిబాబా, నడింపల్లి ఉదయబాబు, బొర్రా ఈశ్వరరావు, కంకటాల రామం, పొలమూరి ధర్మపాల్, నంద్యాల దొరబాబు, కైరం రాము, నల్లా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సొసైటీ చైర్మన్లు మరిన్ని సేవలందించాలి



సొసైటీ చైర్మన్లతో ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సొసైటీ చైర్మన్లు రైతులకు మరిన్ని సేవలందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ సొసైటీ చైర్మన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఇప్పుడు మనం ఏవిధమైన అభివృద్ధి చేయాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తున్నారా లేదా ఆరా తీస్తూ రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. సొసైటీ చైర్మన్లు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పీవీఆర్ నాయుడు, తోలేటి నారాయణమూర్తి (చినకాపు), పాలూరి ఫణి, మట్టపర్తి వెంకటేశ్వరరావు, బొరుసు సత్యనారాయణ, అల్లాడ రవి, అరిగెల సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మామిడికుదురు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆ సంఘ జిల్లా జేఏసీ కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ కోరారు. మామిడికుదురులో సోమవారం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల12న విజయవాలో జరిగే సమగ్రశిక్ష ఉద్యోగుల ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని తీర్మానం చేశారు. ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ ప్రకటించాలని తదితర డిమాండ్ల సాధనకు ఆవిర్భావ సభను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సిర్రా మణికుమార్, యెరుబండి మధు, గాలిదేవర రామకృష్ణ, హేమలత, జ్యోతి, కళాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్స్ నూతన కార్యవర్గం

మలికిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అరుణోదయ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. సంఘ బలోపేతానికి అందరూ సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. నల్లి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా నక్కా శ్రీమన్నారాయణ అధ్యక్షుడిగా జల్లి ధర్మేంద్ర, ఉపాధ్యక్షుడిగా దొండపాటి ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా పాటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కటికిరెడ్డి సత్తిబాబు, కోశాధికారి బొక్కా ప్రసాదరావు, గౌరవ సలహాదారుగా జి.రామకృష్ణను ఎన్నుకున్నారు.

ఆక్సిజన్ అసోసియేషన్‌కు అవార్డు

మామిడికుదురు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాస్థాయిలో పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థకు ప్రత్యేక అవార్డు లభించింది. సోమవారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్‌కు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అవార్డును అందించారు. అసోసియేషన్ ద్వారా చేస్తున్న సేవలను మెచ్చుకుని సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు వి.రాజీవ్, శివ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

యానాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యానాం మున్సిపల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా వి.హీరకుమార్, గూటం రాంబాబు, కార్యదర్శిగా యనమదల రాంబాబు, ఉపకార్యదర్శిగా వి.తేజకిరణ్మయి, కోశాధికారిగా టి.రమాదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా సంగాడి శ్రీనివాస్, అతిలి గోవిందరాజు, పి.జయకృష్ణ, పి.దుర్గారావు, పి.పాపలను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కార్యవర్గ సభ్యులకు సంఘ సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

దాతల సహకారంతో పాఠశాలకు సౌకర్యాలు

అమలాపురంరూరల్, అక్టోబర 6(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు అందించిన నిధులు రూ.2లక్షలతో సౌకర్యాలు కల్పించినట్టు హెచ్ఎం లంక రాజీ సోమవారం తెలిపారు. మధ్యాహ్న భోజనశాల, కళావేదిక, సైకిల్ షెడ్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఉపసర్పంచ్ హనుమాన్ బుజ్జి, నారాయణమూర్తి, బండి సర్వేశ్వరరావు, బ్రహ్మం, స్టాఫ్ సెక్రటరీ జి.పెద్దిరాజు, గోవిందవర్జుల నాగబాబు వంటి దాతల సహకారంతో సౌకర్యాలు సమకూరాయన్నారు.

లడ్డూ వేలం పాట

అమలాపురంరూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):చిందాడగరువులో దేవీశరన్నవరాత్రుల ముగింపులో భాగంగా సోమవారం లడ్డూ వేలం నిర్వహించారు. మట్ట నాగబాబు-లక్ష్మీనాగదుర్గ దంపతులు లడ్డూను రూ.16, 516కు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రంకిరెడ్డి సూరిబాబు, నక్కారామకృష్ణ, యేడిద శ్రీను, ఏడుకొండలు, సురవరపు పెదబాబు, రంకిరెడ్డి బుజ్జి, ఓలేటి మణికంఠశర్మ పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

ఉప్పలగుప్తం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా ఆధ్వర్యంలో సోమవారం గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉన్న కారణంగా కొన్ని రోజులుగా ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. గ్రామంలో పర్యటించిన సర్పంచ్ పరిస్థితిని గమనించి ప్రత్యేక పారిశుధ్య చర్యలకు ఏర్పాట్లు చేశారు. మురుగనీటిని తొలగించి, ఆ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. గోతులు, బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎండీ షెహెన్‌షా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పూడి మాజీ సర్పంచ్ అప్పలస్వామి మృతి



కాట్రేనికోన, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి మాజీ సర్పంచ్ కొంకి అప్పలస్వామి (75) అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2016నుంచి 2020 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ఎంపీటీసీ ర్యాలీ వీరబాబు, రంబాల రమేష్, రంబాల దొరబాబు, సలాది తులసీరావు, రంబాల చౌదరిబాబు, ర్యాలీ బద్రి, కొంకా సూర్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

మలికిపురం, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): శివకోటిలోని మంగెన గంగయ్య తెలగా కాపు కల్యాణ మండపంలో ఈనెల30న ప్రతిభావంతులైన కాపు పేదవిద్యార్థులకు తులసీ సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు చేతులమీదుగా నగదు పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలగా ఉద్యోగుల సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు వాండ్రపు నారాయణస్వామి తెలిపారు. ఇంటర్ రెండో ఏడాది నుంచి పీజీ వరకు 80శాతం కన్నా ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులు దరఖాస్తులను మండల కార్యవర్గానికి ఈనెల10లోగా అందజేయాలని కోరారు.

తైక్వాండో పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక



క్రీడాకారిణులను అభినందిస్తున్న మానేపల్లి అయ్యాజీవేమా

రాజోలు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తైక్వాండోరాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అభినందించారు. ఈసందర్భంగా కోచ్ మణికుమార్ మాట్లాడుతూ కాకినాడలో ఈనెల4న జరిగిన అండర్-17 జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో రాజోలుకు చెందిన వై.గంగాభవానీ, హేమసత్యశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఆర్గనైజర్ కర్రి విజయనారాయణ, కోచ్‌లు మణికుమార్, కరుణకుమార్ తదితరులు అభినందించారు.

జీఎస్టీపై అవగాహన

ముమ్మిడివరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పన్ను సంస్కరణలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ప్రయోజనాల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.చిట్టిబాబు, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ ఎన్.తులసీలక్ష్మి, వాణిజ్య విభాగాధిపతి ఎం.మహ్మద్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన మేక ఏసుదాసు అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు రూ.50,049 విరాళాన్ని అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. వీరిని ఆలయ కార్యనిర్వహణాధికారి అభినందించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల జీసెస్ క్రైస్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ముమ్మిడివరంలోని వరల్డ్ ఇవాంజిలికల్ చర్చిలో సోమవారం మండల పాస్టర్స్ సమావేశం జరిగింది. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బిషప్ బండి సుదర్శనరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా వజ్రపు జోసెఫ్, కందికట్ల ప్రభుదానం, ఉపాధ్యక్షుడిగా కామాడి జాన్‌ప్రసాద్, కార్యదర్శిగా సాపే స్టీఫెన్‌పాల్, సహకార్యదర్శిగా జి.సురేష్‌కుమార్, కోశాధికారిగా ఉండ్రాజవరపు ప్రసాద్, సహ కోశాధికారిగా మల్లవరపు దావీదురాజు, ముఖ్య సలహాదారులుగా పల్లి డేవిడ్, నక్కా క్రిష్టాఫర్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కె.ప్రభుదానం, పాస్టర్లు పాల్గొన్నారు.

విపత్తులను అధిగమించేందుకు మడ అడవుల పెంపకం

అమలాపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులను అధిగమించేందుకు మడ అడవులు పెంపకం ఎంతో అవసరమని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ జి.ఈశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జి.నాగసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఈశ్వరరావు మాట్లాడారు. మడ అడువల వల్ల ఉపయోగాలు, మడ అడవులు పెంచడం వల్ల కలిగే లాభాలను, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పినిపే ముత్యాలబాబు, ఎఫ్ఎస్‌వో డీఎస్ఎన్ మూర్తి, ఎఫ్‌బీవోలు ఎం.సత్యసాయిబాబు, యు.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోటీలు

అయినవిల్లి, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయబాలికా దినోత్సవం, జీఎస్టీ వారోత్సవాల సందర్భంగా అయినవిల్లి మండల వనరుల కేంద్రంలో సోమవారం మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో సీహెచ్‌మహాలక్ష్మి (వీరవల్లిపాలెం), సీనియర్స్ విభాగంలో అప్పారి వేదవల్లి (ముక్తేశ్వరం), వక్తృత్వంలో సీనియర్స్ విభాగంలో ఎం.పల్లవి (వీరవల్లిపాలెం)లు విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆర్.శ్రావ్య(చింతనలంక), కె.చైత్రవర్ధని (కె.జగన్నాథపురం), చిత్రలేఖనంలో బి.లావణ్యవీరసాయి (వీరవల్లిపాలెం)లు జిల్లా స్థాయి పోటీలకు ఎన్నికైనట్టు ఎంఈవో మెల్లం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జి.సాయిశ్రీనివాస్, డి.రామారావు, ఎన్.సత్యకుమారి, పి.మురుగేశ్వరరావు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

రాజోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో ఎన్.మనోహరం ఆధ్వర్యంలో జీఎస్టీ వారోత్సవాలు, అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికల రక్షణ, ప్రాధాన్యం గురించి వివరించారు. ఎంఈవో మనోహరం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో జీఎస్టీపై అవగాహన సదస్సులు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

ఐ.పోలవరం,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు మరణం పత్రికా రంగానికి తీరనిలోటని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు) అన్నారు. అప్పారావు మృతికి ఆయన సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండపేట

వాసవీమాత గ్రామోత్సవం

మండపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో సోమవారం వాసవీమాత గ్రామోత్సవాన్ని నిర్వహించారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు, యువత, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పేద కుటుంబాలకు ఉపాధి కల్పనే లక్ష్యం

• ఏడుగురు చిరు వ్యాపారులకు బడ్డీషాపుల పంపిణీ • సత్యం ఫౌండేషన్ తరపున అందజేసిన మంత్రి సుభాష్



బడ్డీకొట్లు అందజేసి వ్యాపారం ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పని చేస్తున్నదని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురంలో ఏడు పేద కుటుంబాలకు చిరు వ్యాపారాల నిమిత్తం స్థలాలు కేటాయించి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సమకూర్చిన బడ్డీకొట్లను మంత్రి అందజేసి ప్రారంభించారు. ఎండమడల రాము, వై.మల్లేశ్వరి, దార్ల దేవదానం, కె.ప్రభాకరరావు, అహ్మద్ అలీషా, జి.కనకరామకృష్ణ, దుర్గాదేరా కృష్ణ ప్రసాద్ కుటుంబాలకు మంత్రి బడ్డీకొట్లను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం పి4 పథకం అమలుచేస్తున్నదన్నారు. నియోజకవర్గంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పేద ప్రజలకు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ సత్యం మాట్లాడుతూ సేవే సత్యం ...సేవే నిత్యం నినాదంతో పేద కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఫౌండేషన్‌కు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను సోమవారం మంత్రి సుభాష్ అందించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు రూ.7.40,391 చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, పలువురు నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన మెకానిక్‌లు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని మంత్రి సుభాష్ సూచించారు. సోమవారం ద్రాక్షారామలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 78 మంది బైక్ మెకానిక్‌లకు నెలరోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మెకానిక్‌లకు ముద్ర రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు మెకానిక్‌లకు ఉచితంగా టూల్‌కిట్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బైక్ రిపేరు శిక్షణ నిపుణుడు శివ గణేష్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, కూటమి నాయకులు పెంకె సాంబశివరావు, బలుసు శివ ప్రసాద్, కోట తాతబ్బాయి, పలివెల ప్రకాష్, తిరుమలరావు, మెకానిక్ యూనియన్ నాయకులు పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించే అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఏపీఎన్జీజీవోల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మల్లికార్జునుడు, ఆర్.మోహన్ కోరారు. సోమవారం కపిలేశ్వరపురం, మండపేట మండల పరిషత్ కార్యాలయాల వద్ద వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కపిలేశ్వరపురం ఎంఈవో కె.తాతారావు, ఏవో బి.రవి, మండల పరిషత్ ఏవో జి.రాజేంద్రప్రసాద్, ఎం.రామకృష్ణ (పశు సంవర్ధకశాఖ), అమ్మతాపురం ఎంపీహెచ్ ఈవో గోపాలకృష్ణ, నానిబాబు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్య అన్నదాన పథకానికి పాలకొల్లుకు చెందిన జడ్డు భోజరాజశేఖర్, గంగాభవాని దంపతులు రూ.50,116, సామర్లకోటకు చెందిన దేవళ రామకృష్ణచౌదరి, భువనేశ్వరి దంపతులు రూ.25,116 విరాళాలు సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు. వేదికపై జేసీ నిషాంతి, ఆర్డీవో శ్రీకర్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత లాభం

ఎమ్మెల్యే సత్యానందరావు, జేసీ నిషాంతి

రావులపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ప్రజలకు మరింత లాభమని వక్తలన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. రావులపాలెం వేమన రెడ్డి కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జేసీ టి.నిషాంతి, ఆర్డీవో పి.శ్రీకర్‌తో కలిసి ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ 2.0 అన్ని వర్గాలకే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. అనంతరం జేసీ నిషాంతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కె.శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, చిన్న కేవీ, పంచాయతీ జిల్లా అధికారి డి.శాంతకుమారి, సీటీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు ముక్తేశ్వరరావు, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిర్ణయంతో ప్రజలందరికి మేలు



రావులపాలెంలోని హోమ్‌నీడ్స్ షాపులో ధరలను తెలుసుకుంటున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రావులపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రావులపాలెంలో నాయకులతో కలిసి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై మాట్లాడారు. అనంతరం రిలయన్స్ మార్ట్, బైక్ షోరూమ్‌లు, హోమ్‌నీడ్స్‌లో పర్యటించి తగ్గిన ధరల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కార్యదర్శి నడింపల్లి సుబ్బరాజు, చాంబర్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి, కార్యదర్శి సూరిబాబు, బీజేపీ సీనియర్ నాయకులు పాలూరి సత్యానందం, కర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ధరలను వెంటనే అమలు చేయాలి

ఆలమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యాపారులు అమలు చేయాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరులో సోమవారం షాపుల నిర్వాహకులతో ఆయన చర్చించారు. నేరుగా షాపులకు వెళ్లి జీఎస్టీ తగ్గింపు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లాకుల మరమ్మతులకు ప్రతిపాదనలు

ఆలమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఇరిగేషన్ లాకుల పరిస్థితిలపై నీటి సంఘాల ప్రతినిధులు, నీటిపారుదల డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్‌తో చర్చించి మరమ్మతులకు ప్రతిపాదనలు చేశారు. ఆలమూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ సునీల్ కుమార్, వైస్ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఆలమూరు డీసీ ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి, ఆలమూరు, చింతలూరు సాగునీటి సంఘాల అధ్యక్షులు వైట్ల గంగరాజు, గారపాటి శ్రీనివాసరావులతో పాటు పలువురు అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని గత ప్రభుత్వంలో రిపేర్లు చేయకపోవడంతో మరింత అధ్వానంగా మారాయన్నారు. తక్షణం నిధులు మంజూరు చేసి బాగు చేయించాలని కోరారు. ఆలమూరు ఇరిగేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని నూతన భవనం నిర్మించడానికి ప్రతిపాదనలు చేయాలని సూచించారు. అనంతరం నీటి సంఘాల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆలమూరు లాకులను పరిశీలించారు. నేవిగేషన్ లాకులు పూర్తిగా కుప్పకూలిపోవడంతో సక్రమంగా నీరు చేరక కాలువ శివారు భూములను సాగునీరు అందడం లేదని నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు వివరించారు. లాకుల అభివృద్ధికి తక్షణం నివేదికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ప్రాజెక్టు ఛైర్మన్ సునీల్‌కుమార్ సూచించారు.

రావులమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

ఆలమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలతో అంకురార్పణ జరిపారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయానికి ఎదురుగా ఉన్న పోతురాజు ఆల యంలోకి మార్పు చేయడానికి శైవాంగ పండితుడు కాళ్లకూరి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కాళ్లకూరి సూరిపండు, ఆలయ ప్రధానార్చకుడు వేదుల లక్ష్మణ్‌లతోపాటు పలువురు పండితులు శాంతి హోమం జరిపించారు. ఈ హోమంలో గ్రామానికి చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులతో పాటు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు గాజులు బహూకరణ

రావులమ్మ అమ్మవారికి రూ.3లక్షల విలువైన బంగారు గాజులను దాతలు బహూకరించారు. గ్రామానికి చెందిన గరగ చిట్టెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అమ్మవారికి బంగారు గాజులను సోమవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, అర్చకస్వాములు అభినందించారు.

‘స్వచ్ఛ’ అవార్డులపై హర్షాతిరేకాలు



కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు, ఛైర్‌పర్సన్ రాణి

మండపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మున్సిపల్‌గా ఎంపికైన మండపేట మున్సిపాల్టీ సోమవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అవార్డులను అందుకున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ మునిపల్ భవనంగా ఎంపికవడం తోపాటు స్వచ్ఛతా హీలో అవార్డు దక్కడం ఆనంద ంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల హర్షం

మండపేట మున్సిపాల్టీ స్వచ్ఛతా హీలో ప్రథమస్థానంలో అవార్డు దక్కటం పట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుకోసం కృషి చేసిన కమిషనర్ రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు, శానిటరీ సిబ్బందిని ఆయన అభినందించారు.

అవార్డు పొందడంపై హర్షం

స్వచ్ఛ పంచాయతీగా పాలతోడు ఎంపికవడంతో కలెక్టర్ మహేష్ కుమార్ నుంచి సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పిల్లా తాతాలు, కార్యదర్శి కె.వర ప్రసాద్ అవార్డును అందుకున్నారు. అవార్డు రావటంపై సర్పంచ్‌తో పాటు, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

జొన్నాడ అంగన్‌వాడీ టీచర్‌కు...

ఆలమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుకు జొన్నాడ అంగన్‌వాడీ టీచర్ గెద్దాడ ఆదిలక్ష్మి సోమవారం జిల్లా కలెక్టర్ నుంచి అమలాపురంలో అవార్డును అందుకున్నారు. అవార్డు పొందిన ఆమెను కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, అరుంధతి, వరలక్ష్మి, పలువురు అంగన్‌వాడీ టీచర్లు అభినందించారు.

ఆర్టీసీ డిపోకు అవార్డు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్టీసీ డిపోకు జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. సోమవారం కలెక్టర్ నుంచి డిపో మేనేజరు పేపకాయల భాస్కరరావు అవార్డు అందుకున్నారు.

ఎస్‌ఐజీ మున్సిపల్ పాఠశాలకు అవార్డు: రామచంద్రపురంలోని చింతపల్లి సూరన్ననగర్‌లో ఎస్‌ఐజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు జిల్లాస్థాయి స్వచ్ఛతా అవార్డు లభించింది. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ మూర్తి జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు

రావులపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని పేద, మధ్య తరగతి వారికి సీఎం సహాయనిధి మేలు చేకూరుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 54 మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మద్దతు

కపిలేశ్వరపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగర శ్రీగణపతి చేనేత సహకార సంఘం వద్ద తొమ్మిది రోజులుగా చేనేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు మద్దతు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న ఐక్యవేదిక సంఘ అధ్యక్షులు ధూళి జయరాజు, ప్రధాన కార్యదర్శి వీరమల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం.గణపతిరావు మాట్లాడారు. అంగర చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల కాకపోవడంతో వారు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి చేనేత కార్మికుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి టి.మహేష్, కె.వెంకట్రావు, ఎంఆర్పీఎస్ నాయకుడు బుంగ దావీదు, అంగర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రాయవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెల్లూరు వేణుగోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్ కాదా శ్రీను అన్నారు. సోమవారం స్థానిక కోరంగి కాలువ, గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి అనూరాధ, అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ దాలిపర్తి పాపారావు, మాజీ సర్పంచ్ నూని ఏసుబాబు, మాజీ వైస్ ఎంపీపీ దేవ వెంకట్రాజు, సహకార సంఘం డైరెక్టర్ తలాటం వెంకటేష్, వల్లూరి ప్రసాద్, కొప్పిశెట్టి శ్రీను, మామిడిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

మండపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసే మేడిశెట్టి వేంకటేశ్వరరావు (58) సోమవారం తెల్లవారు జామున ఇంటివద్ద గుండెపోటుకు గురై మృతి చెందారు. 1998లో విధుల్లో చేరిన ఈయన సుదీర్ఘకాలం నుంచి మండపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. బిల్లు కలెక్టర్‌గా చేరిన ఈయన ప్రస్తుతం రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. మున్సిపల్ కమిషనర్ రంగారావు, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, మేనేజర్ బి.రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తదితరులు సంతాపం తెలిపారు.

బాలికా సంరక్షణపై వ్యాసరచన పోటీలు

కె.గంగవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపులు, బాలికా సంరక్షణ విభాగంలో మండల స్థాయిలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను పామర్రు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఎంఈవో1 ఏ.నాగరాజు పర్యవేక్షణలో 12 ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికా సంరక్షణ అంశంలో వ్యాసరచన పోటీల్లో జి.తేజస్విని, వక్తృత్వంలో వై. లక్ష్మీదుర్గ, డ్రాయింగ్‌లో ప్రవల్లిక, జీఎస్టీ అంశంలో వ్యాసరచన పోటీలో బి.హస్నిక, వక్తృత్వంలో కె.పుష్పలత, డ్రాయింగ్‌లో వై.వినీత ప్రథమ స్థానాలు సాధించారు. మంగళవారం అమలాపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని ఎంఈవో ఏ.నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో పామర్రు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్రా ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో జీరో కరెంట్ బిల్లు

మండపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో కరెంట్ బిల్లును జీరో చేసుకోవాలని మండపేట విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఏడిదలో సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపు, సోలార్ వినియోగం, విద్యుత్ బిల్లుల్లో ట్రూ అప్ చార్జీల తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కూటమి నాయకులు విద్యుత్‌శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్, ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం వంటి వాటిపై ప్రజా ప్రతినిధులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పి.వీర్రాజు, సహకార సంఘ అధ్యక్షుడు ఎర్రబ్బు, మేకా జేజిబాబు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనువాస్, కూటమి నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పుష్కరాల రేవులో బురద తొలగింపు



కోటిపల్లి పుష్కరాల రేవులో బురదను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కె.గంగవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గడంతో స్థానిక పుష్కరాల రేవులో మెట్లపై బురద తేలిన విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై కోటిపల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్ స్పందించారు. సోమవారం పుష్కరాల రేవు మెట్లపై ఉన్న బురదను తొలగించి శుభ్రం చేయించారు. సర్పంచ్ పెమ్మాడి బేబి తదితరులు పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ రహిత పట్టణమే లక్ష్యం

మండపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. నిబంధనలను అతిక్రమించి పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించే వ్యాపారులు, విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పట్టణంలో సోమవారం పలు దుకాణాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ ఉద్యోగులు, శానిటరీ సిబ్బందితో కలిసి దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మెయిన్ రోడ్డులో వున్న పలు దుకాణాల్లో జరిపిన దాడుల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఏడిద బైపాస్ రోడ్డులో గల రైస్‌మిల్లుల వద్ద వున్న వ్యర్థాలను తొలగించాలని మిల్లు యజమానులకు నోటీసులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు. రూ.లక్ష విలువైన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకుని వ్యాపారికి రూ.20వేల ఫైన్ వేశామని కమిషనర్ తెలిపారు. ఈ దాడుల్లో శానిటరీ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత రాకుండా గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి యు.పూర్ణిమ అన్నారు. సోమవారం మాచరలో ఐసీడీఎస్ అధ్యక్షులు రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఉపసర్పంచ్ అడపా వేణు, కూటమి నాయకులు గుడాల జయబాబు, కరెడ్ల సురేష్‌బాబు, జి.తారాకృష్ణ, కె.భగవాన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సీడీపీవో పూర్ణిమ, సెక్టారు సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం గర్భవతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహారం, రక్తహీనత రాకుండా తీసుకోవల్సిన ఆహారం తదితర అంశాలపై వివరించారు. అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జి.సూర్యప్రకాష్, వి.రాజారావు, ఎ.సత్యనారాయణ, ఎం.శ్రీరామమూర్తి, జి.సత్యనారాయణ, కార్యదర్శి వి.చిన్నబాబు, గుబ్బల లోవకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.